## గొర్రెలు మృతి



**టీ మీడియా, మే13 ,కురవి** :పామాయిల్ తోటకు వేసిన యూరియా నీళ్లు తాగడంతో 11 గొర్రెలు చనిపోయిన సంఘటన కురవి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది.కొరవి మండల కేంద్రానికి చెందిన రైతులు తోడుసు వెంకన్న,కాట్యాల వెంకన్న గొర్రెల కాపరులు ప్రతిరోజు లాగా తమ గొర్రెలతో మేపడానికి వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో స్థానిక రైతుపామాయిల్ తోటలో మొక్కలకు యూరియా వేసిన తర్వాత నీళ్లు పెట్టారు. అది గమనించక ఎండ తీవ్రతకు దాహంతో ఉన్న గొర్రెలు యూరియా కలిసిన నీళ్లను తాగి చనిపోవడం జరిగిందని బాధిత రైతులు తెలిపారు. వాటి విలువ రెండు లక్షల రూపాయలు ఉంటుందన్నారు.


Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా


సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 120
సంచిక : 240
పేజీలు : 3
గురువారం, మే 14, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN


# కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## -జిల్లా కలెక్టర్ అంకిత్



**టీ మీడియా, మే 13 , భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఇల్లందు వ్యవసాయ కమిటీ, చల్లసముద్రం, టేకులపల్లి, బోడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి కొనుగోలు, నిల్వ, లోడింగ్, రవాణా ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారుమొదటగా ఇల్లందు వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన మొక్కజొన్న బ్యాగులు, కొనుగోలు వివరాలు, గోదాముల సామర్థ్యం, హమాలీల అందుబాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 54 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ కమిటీ ప్రాంగణంలోని గోదాముల్లో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు.లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు గాను స్థానిక కూలీల ద్వారా అదనపు లోడింగ్ పనులు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు తెలియజేయగా, రోజువారీ చెల్లింపులు వెంటనే చేపట్టి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిల్వ స్థలాల కొరత నివారణకు గిరిజన భవనాలు, కళాశాలల ఫంక్షన్ హాల్స్ వంటి ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.రవాణా ప్రక్రియ వేగవంతం చేసేందుకు ట్రాక్టర్లు, డీసీఎంలను కూడా వినియోగించుకోవాలని సూచించిన కలెక్టర్, రెండు రోజుల్లో లోడింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రేపల్లెవాడలోని చల్లసముద్రం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడం, గన్ని బ్యాగుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా రవాణా శాఖ అధికారులతో మాట్లాడి తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని బ్యాగుల కొరతపై డీఎం మార్క్ఫెడ్ అధికారులతో మాట్లాడి వెంటనే 50 వేల గన్ని బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 17 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.కొమరారం కొనుగోలు కేంద్రంలోని నిల్వలను కూడా కారేపల్లి గోదాములకు తరలిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కారేపల్లిలో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉన్నందున అక్కడ నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.టేకులపల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్ టేకులపల్లి వ్యవసాయ కమిటీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని మొక్కజొన్న నిల్వలు, రవాణా సదుపాయాలు, హమాలీల అందుబాటు, గోదాముల పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో సుమారు 1,50,000 మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సూర్యాపేట జిల్లా కోదాడ మార్కెట్ యార్డుకు మొక్కజొన్న తరలిస్తున్నట్లు వివరించారు.ప్రత్యామ్నాయ నిల్వల కోసం టేకులపల్లి ఉన్నత పాఠశాలలో తాత్కాలిక నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా పెట్రాల చిలక గ్రామంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన రెండు గోదాములు ఉండగా, వాటికి 10 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు వివరించారు. వెంటనే ఆ గోదాములను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన అనుమతులు పొందాలని, తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 148 మంది హమాలీలు అందుబాటులో ఉన్నారని అధికారులు తెలపగా, రవాణా కోసం తగినన్ని లారీలు ఏర్పాటు చేసి నిల్వల తరలింపును వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం బోడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో సుమారు 6 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. రవాణా ప్రక్రియపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, గత మూడు రోజులుగా ట్రాక్టర్లతో కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉన్నామని రైతులు తెలియజేయగా, వెంటనే స్పందించి ట్రాక్టర్లలో ఉన్న మొక్కజొన్నను కొత్తగూడెం మార్కెట్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తగినన్ని గన్ని బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం

# అధిక సామర్థ్యం గల గోదాలను సిద్ధం చేయండి

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**టీ మీడియా, మే 13 ,ఖమ్మం:**జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా సామర్థ్యం గల గోదాంలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ ఖమ్మం త్రీ టౌన్ లోని వ్యవసాయ మార్కెట్ నందు మొక్కజొన్న నిల్వల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్న గోదాములకు తరలింపు రవాణా ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పరిశీలించారు. మిర్చి, పత్తి మార్కెట్ లలో మొక్కజొన్న నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సదుపాయాలకు అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి గోదాంకు ముమ్మరంగా తరలింపు చేపట్టాలని తెలిపారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.హమాలీల సంఖ్యను పెంచి లారీల అన్‌లోడింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లారీలు వచ్చిన వెంటనే మొక్కజొన్న దించుకునేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ స్టోరేజ్ గోదాములను గుర్తించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.నిల్వ సామర్థ్యాన్ని పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని,మొక్కజొన్న

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా అధికారి..

**టీమీడియా ,మే13,చింతూరు:**చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిని నూతన పోలవరం జిల్లా సమన్వయ అధికారి డా. సాంబశివరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ప్రత్యేకంగా ఎస్ యన్ సి యు విభాగాన్ని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న గుర్తుతెలియని శిశువుకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న సంరక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే డయాలసిస్ విభాగాన్ని పరిశీలించి, రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు.ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలు అధిక సంఖ్యలో నిర్వహిస్తున్నందుకు వైద్యులు, సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కోటిరెడ్డి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాల గురించి జిల్లా సమన్వయ అధికారికి వివరించారు.



## నీట్ లీక్‌పై అరెస్టులు ఖండన

**-జూపల్లి రాము**



**టీ మీడియా,మే13,సింగరేణి(కారేపల్లి):** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ టూరిజం శాఖ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గవర్నర్ భవన్ ముందు శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్వి నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అక్రమ అరెస్టులు చేయడాన్ని బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం నియోజకవర్గ నాయకులు జూపల్లి రాము తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న బిఆర్ఎస్వి నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం, ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన సుమారు 23 లక్షల మంది విద్యార్థులు ప్రశ్నపత్రం లీక్ కారణంగా తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



## సర్పంచులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

**ఎంఈఓ- దుగ్గిరాల జయరాజు**

**టీ మీడియా,మే13,సింగరేణి(కారేపల్లి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యాశాఖ వారోత్సవాల్లో భాగంగా సర్పంచులకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల.జయరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ విద్యాభివృద్ధికి సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడంతో పాటు విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ప్రతి సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరు శాతం పెంపు, పరిశుభ్రత నిర్వహణ వంటి అంశాల్లో గ్రామపంచాయతీలు భాగస్వామ్యం కావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు రంజిత్ కుమార్,స్థానిక కారేపల్లి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ),దిశా కమిటీ సభ్యురాలు హేమలత బాలాజీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎలియట్ ప్రేమ్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు బి. శ్యామ్లాల్, ఎల్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, విద్యాశాఖ సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం...!!

**టీ మీడియా, మే 13,మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ , జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి. ఉపేందర్ రావు తెలియపరిచారు. ఎంపీసీ, బైపిసి, సీఈసీ, ఏసీఈ, గ్రూపులలో ఈనెల 13 నుంచి మే 25 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి రుసుములేదు ఉచితం. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.




## పని హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వం

**కొత్త నిబంధనాలాతో ఉపాధి దూరం**

**15 తేదీన పంచాయతీ**

**కార్యాలయాల వద్ద ధర్నా జయప్రదం చేయండి**



**టీ మీడియా,మే13,సింగరేణి(కారేపల్లి):** కేంద్రంలోని మోడి ప్రభుత్వం రాజ్యాంగ బద్ద పని హక్కును హరిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కేసగాని ఉపేందర్ అన్నారు.బుధవారం కారేపల్లి మండలం గాంధీనగర్ లో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వ్యకాస బృందం సందర్శించింది. కూలీలలో వ్యకాస నేతలు మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందటం లేదని, రెండు సార్లు ఫోటో విధానంతో ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు తెలిపారు. కూలీలకు సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 15 న పంచాయతీ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఉపాధి కూలీలు అందరు పాల్గొని ఆదరణ జయప్రదం చేయాలని కోరారు ఈసందర్భంగా వ్యకాస నేత కేసగాని ఉపేందర్ మాట్లాడుతూ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎనఆరఈజీఎస్ ను వీబీజీరాంజీ గా పేరు మార్చటంతో పాటు నిధులలో కోత విధించిందన్నారు. ఉపాధి నిధులలో కేంద్రం 60 శాతం ఇస్తామని మిగతాది 40 శాతం ఇవ్వాలని షరతులతో లక్ష్యం నీరుగారే పరిస్థితి వచ్చిందన్నారు. రోజు వారి కూలీ రూ.307 ఇవాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా పడటం లేదన్నారు. పని ప్రదేశాలలో టెంట్, నీరు, మెడికల్ కిట్స్ కల్పించటం లేదన్నారు. కూలీలకు ప్రమాధ భీమా కేంద్రం ప్రభుత్వం అమలు చేయాలని ప్రమాదానికి గురైతే రూ.10 లక్షలు సాయం అందించాలన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచి రూ.600 వేతనం, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలందరికి ఇస్తానన్నా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం సమస్యలపై ఈనెల 15 న జిపి కార్యాలయాల ముందు 20 తేదీ న ఖమ్మం కలెక్టర్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో మౌనిక, నాగమణి బాయమ్మ, సూరమ్మ,దశరథ, కోటయ్య, వెంకన్న, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు..

# అండగా నిలిచిన పద్మశాలి సంఘం



**టీ మీడియా, మే 13, రామకృష్ణాపూర్;** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పట్టణంలోని శివాజీ నగర్ కు చెందిన పెనుమల్ల గడ్డయ్య గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.ఈ విషయాన్ని బంధుమిత్రుల ద్వారా రామకృష్ణాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ,ఆడెపు తిరుపతి లకు తెలిసిన వెంటనే మృతుని కుటుంబం యొక్క పేదరికాన్ని తెలుసుకొని సంఘం వాట్సప్ గ్రూపులో సమాచారం ద్వారా సభ్యులు తోచిన విధంగా ఆర్థిక సహాయంగా 8700 రూపాయలు జమ చేసి బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా కుటుంబాన్ని ఆదుకోవడానికి సంఘం ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇవ్వడం జరిగింది.మృతుని కుటుంబ సభ్యులు పద్మశాలి సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంబార్ వెంకటస్వామి,వేముల వెంకన్న,కొండ కుమార్,వొడ్నాల శ్రీనివాస్,కాసర్ల ప్రకాష్,చిందం మల్లేష్,పిస్క వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## చైర్మన్ కుమార్తె వివాహం

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :** నాగర్ కర్నూల్ జిల్లా నాయనిపల్లి మైసమ్మ దేవాలయ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ కుమార్తె వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే కుందేళ్ళ అర్జున్ యాదవ్, వనపర్తి జిల్లా కేంద్రంలో కళ్యాణ్ సాయి గార్డెన్స్ లో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్వాన్ కార్పొరేటర్ మందగిరి స్వామి యాదవ్ , శ్లోక విద్యా సంస్థల చైర్మన్ గాలయ్య,జిల్లా స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తాసీల్దార్‌గా సునీత ఎలిజబెత్ బాధ్యతల స్వీకారం



**టీ మీడియా,మే13, ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల నూతన తాసీల్దార్‌గా శ్రీమతి కె.సునీత ఎలిజబెత్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖమ్మం కలెక్టరేట్ నుండి ఎర్రుపాలెంకు వచ్చిన ఆమె తాసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వకంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా చేరవేసే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

## ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

**-పనుల ప్రారంభం**

**టీ మీడియా, మే 13, టేక్మాల్ :** టేక్మల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో గుండు వాగు పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు.గతేడాది కురిసిన భారీ వర్షాలకు గుండు వాగు ఉధృతిగా ప్రవహించి వరద నీరు గ్రామ చౌరస్తా మీదుగా వెళ్లడంతో గ్రామం తీవ్రంగా దెబ్బతింది. ప్రతి వర్షాకాలంలో వరద ముప్పుతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకరప్ప మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి సూచనల మేరకు జిల్లా అధికారులు గ్రామాన్ని సందర్శించిపరిశీలించారు.

అధికారుల నివేదిక అనంతరం గుండు వాగులో పేరుకుపోయిన మట్టిని తొలగించే పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే వరద ముప్పు ఉండదని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.సమస్యపై వెంటనే స్పందించి పనులు ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకరప్ప, సర్పంచ్ అవినాష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ మాధవి భూషణం, వార్డు సభ్యులు నర్సింలు, గోపాల్, శ్రీశైలం, రవిశంకర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



# 3 నెలలోగా సమస్యలన్నీ పరిష్కారం

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**టీ మీడియా, మే13, కూసుమంచి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాలేరు నియోజకవర్గం లోని ప్రజా దర్బార్ సభల్లో ప్రజల నుండి వచ్చిన వినతులన్నింటినీ 3 నెలల్లోగా పరిష్కారం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచి మండలం జీల చెరువు గ్రామము లో బుధవారం జరిగిన ప్రజాదర్బార్ లో మంత్రి పాల్గొని మాట్లాడారు, నా పేదింటి ఆడబిడ్డల సొంత ఇంటి నిర్మాణ కల నెరవేర్చుతూ కోరిన ప్రతి అక్క ,చెల్లి కి ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీ ప్రకారం మాట తప్పకుండా మహిళలకు ఉచిత బస్సు ,గృహాలకు ఉచిత విద్యుత్ సరఫరా,రైతులకి 2 లక్షల రుణమాఫీ , రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ,వరి ధాన్యం కి 500 రూపాయల బోనస్ తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజా దర్బార్ సభల్లో ప్రజల నుండి వచ్చిన వినతుల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కారం చేస్తున్నట్లు మరికొన్ని సమస్యలు వారం ,15 రోజులలోగా పరిష్కారం జరిగేటట్లుగా అన్ని శాఖల అధికారులని ఆదేశించామని ఆయన అన్నారు రానున్న 3 సంవత్సరాల కాలంలో మిగిలి ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమం ,అభివృద్ధికి తమ ఇందిరమ్మ ప్రభుత్వం శాయ, శక్తుల కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే పాలేరు నియోజకవర్గ ప్రజలనీ తాను నేరుగా ప్రజా దర్బార్ ద్వారా కలుస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షలమంది రైతులకి రైతుబంధు 4. లక్షల50 వేల మంది లబ్ధిదారులకు గృహమేంజురి, నిర్మాణాలు జరుగుతున్నట్లు, రెండవ విడతలు అధిక గృహ మంజూరి చేస్తామని డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వ తీరుతో వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పోటీ పరీక్షల పేపరు లీక్ చేసి నిరుద్యోగ యువకుల భవిష్యత్తుని కాలరాశారని మంత్రి ఆరోపిస్తూ, తన ఆవేదన వ్యక్తం చేశారు .పోటీ పరీక్షల పేపర్ లీక్ తో నష్టపోయిన విద్యార్థులని కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం, గత తెలంగాణ ప్రభుత్వ తీరుతో నిరుద్యోగం పేరుకుపోయిందని ఆయన ఆరోపించారు. కలలో ఉన్న మొక్కజొన్న పంటని చివరి గింజ వరకు కొంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మక్క రైతులకు భరోసా ఇచ్చారు. సభ లో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జరుగుతున్న ఈ ప్రజా దర్బార్ కి ప్రతి క్లస్టర్ కేంద్రంగా 2 వేల నుండి2500 వరకు ప్రజల నుండి వినతులు వస్తున్నాయని అన్నారు. కొన్ని ప్రజా



సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మరికొన్ని సమస్యల పరిష్కారం కి ప్రక్రియ వేగవంతంగా జరుపుతున్నట్లు కలెక్టర్ దివాకర్ చెప్పారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అనుబంధ రైతు సంఘం రైతు సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ ప్రజా దర్బార్ సభలో నేలపట్ల లోక్యతండ పోచారం చేగోమ్మ ముత్యాల గూడెం కేశవాపురం మునిగేపల్లి తదితర 15 గ్రామ పంచాయితీల ప్రజలు పాల్గొని తమ వినతులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కూసుమంచి తహసిల్దార్ సైదయ్య, ఎంపీడీవో రాజారావు, కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హఫీజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న కొనుగోలు చేయాలి

### మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందించిన సిపిఎం

**టీ మీడియా,మే13,కూసుమంచి:** మండల వ్యాప్తంగా మొక్కజొన్న, వరి పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ ,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సిపిఎం తెలంగాణ రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బుధవారం మండలంలోని జీళ్ళ చెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ రెడ్డికి రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.మండల వ్యాప్తంగా మొక్కజొన్న, వరి పంటలను కొనుగోలు చేయాలని మండలానికి అధిక లారీలను పంపించి ధాన్యాన్ని తరలించాలని, గోడౌన్స్ దగ్గర హమాలీల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వ గోడౌన్స్ లేని పక్షంలో కళ్యాణ మండపాలు, పాత ఇండస్ట్రియల్ ను ప్రభుత్వం అద్దెకు తీసుకొని, రైతుల ధాన్యం తరలించాలని, ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల వ్యవధిలోనే రైతులకు కు డబ్బులు జమ చేయాలని మా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు, తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షులు బిక్కసాని గంగాధర్, కేశవపురం గ్రామ సిపిఎం కార్యదర్శి బెల్లం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు రూప్లా నాయక్, కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు



## హౌసింగ్ మ్యాపింగ్‌పై కమిషనర్ ప్రత్యేక దృష్టి

**టీ మీడియా,మే13,కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీలో కొనసాగుతున్న సెన్సస్ ప్రక్రియలో భాగంగా హౌస్ మ్యాపింగ్ విధానాన్ని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సిబ్బంది నిర్వహిస్తున్న వివరాల సేకరణ, మ్యాపింగ్ పనితీరును ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ప్రజలతో సానుకూలంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని తెలిపారు.అనంతరం స్థానికులతో మాట్లాడి సెన్సస్ ప్రాముఖ్యతను వివరించారు.హౌస్ మ్యాపింగ్ ద్వారా పట్టణ అభివృద్ధి ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన డేటా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ జిల్లెల్ల స్వాతి, మున్సిపల్ సిబ్బంది,ఫీల్ ఎన్యూమరేటర్లు, సర్వేయర్లు, స్థానికులు పాల్గొన్నారు.

## నిలిచిన ధాన్యం కొనుగోళ్లు..

### అన్నదాతల ఆగ్రహం



**టీ మీడియా,మే13,బూర్గంపహాడ్ :** బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం సేకరణ నిలిచిపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యార్డులో ధాన్యం బస్తాలు పేరుకుపోవడంతో లారీల కొరత కారణంగా ధాన్యం సేకరణ నిలిపివేయడంతో రైతులు అసహనానికి గురవుతున్నారు. మరోపక్క వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నా, వర్షసూచన ఉన్నా కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలను సకాలంలో తరలించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి ధాన్యం బస్తాలు ఆరుబయటే ఉండిపోవడంతో తేమ పట్టి నాణ్యత దెబ్బతినే ప్రమాదం సైతం ఉందని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా లారీల ఏర్పాటు మొక్కుబడిగా ఉండటం, లారీల కొరతతో ధాన్యం తరలింపు నిలిచిపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయి.సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదని, తమ గోడు పట్టించుకునే వారేరని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. కష్టపడి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర రాకుండా ఇప్పుడు వర్షాభావ పరిస్థితులతో తడిచిపోయే పరిస్థితి ఎదురైందని...ఇది రైతులను నట్టేట ముంచడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేసి ధాన్యం సేకరణకు తగినన్ని లారీలను ఏర్పాటు చేసి మిల్లులకు తరలించాలని పీఏసీఎస్ అధికారులను రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## వీఓఏల సమస్యలు పరిష్కరించాలి’

### లేకుంటే ఈ 18 నుండి ఆందోళనలు

**టీ మీడియా,మే13, ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో ఐకేపీ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న వీఓఏలు తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం వీఓఏ జేఏసీ ఆధ్వర్యంలో ఎర్రుపాలెంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన +ఉ 363/2025 అలాగే జీఓ 302/2022 ప్రకారం అమలు చేయాల్సిన పలు అంశాలు ఇంకా అమలులోకి రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వీఓఏలకు తగిన వేతనాలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.వీఓఏల ప్రధాన డిమాండ్లలో నెలకు రూ.20 వేల వేతనం అమలు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోట్ చేయడం, రూ.20 లక్షల భీమా సౌకర్యం కల్పించడం, ట్యాబ్ సౌకర్యం ఇవ్వడం, జీఓ 58ను సవరించడం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఈ నెల 18 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. అనంతరం జేఏసీ తరపున సమ్మె నోటీసుకు సంబంధించిన లేఖను ఎర్రుపాలెం ఎస్ఐ రమేశ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏ కమిటీ సభ్యులు కోట హేమలత, పి.కనకదుర్గ, ఏ.ఏడుకొండలు, వేమిరెడ్డి సుజాత, రజిత, జరీనా, ప్రశాంతి, వరలక్ష్మి, లావణ్య, కమల, సరోజిని పాల్గొన్నారు

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, రవాణా, గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి నరేందర్, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అధిక సామర్థ్యం గల గోదాలను సిద్ధం చేయండి

నిల్వ, రవాణా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, సంబంధిత శాఖల అధికారులు, మార్కెట్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మక్కలు కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

**టీ మీడియా,మే13, ముదిగొండ:** మక్కలు, ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు మెరుపు ధర్నాకు దిగిన సంఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. గత మూడు రోజులుగా ఆన్‌లైన్ సేవలు పని చేయకపోవడంతో పంటల వద్దే పడికాపులు కాస్తున్నారు. ఇవాళ తెల్లవారుజామునే వస్తే ఈరోజు కూడా పనిచేయట్లేదు అని చెప్పడంతో కోపోద్రిక్తులైన రైతులు ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆరుగాలం నానా పాట్లు పడి పంట పండిస్తే పంటను అమ్ముకోవడానికి అంతకుమించి తిప్పలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం చెబుతున్న క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉందని అన్నారు. కల్లాల్లో ధాన్యం పోసి ఎప్పుడు కొంటారని ఎదురు చూస్తున్నామని చీకటి పడితే చాలు వర్షం వస్తుందేమోనని గుండెలపై చేయి వేసుకొని బిక్కుబిక్కుమంటూ ఉంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

